క్లుప్తంగా

వినాయక విగ్రహాలకు అనుమతి తప్పనిసరి

ఓజిలి: వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఏర్పాటు చేసే వినాయక మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్‌ఐ స్వప్న తెలిపారు. సింగిల్‌విండో విధానంలో అనుమతి ఇస్తామన్నారు. విగ్రహాల ఏర్పాటు మొదలు నిమజ్జనం వరకు జరిగే కార్యకలాపాలకు కమిటీ సభ్యులదే బాధ్యతని చెప్పారు. విగ్రహాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా కఠిన చర్యలు తప్పవన్నారు. వినాయక మండపాల వద్ద మైక్, డీజే, ఇతర పరికరాలను ఏర్పాటుకు అనుమతి తప్పనిసరన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

వెంకటగిరి రూరల్ : ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రాదని వెంకటగిరి సీఐ ఏవీ రమణ హెచ్చరించారు. ఆయన గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై దృష్టిసారించి ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. తోటి విద్యార్థులపై ర్యాగింగ్ పాల్పడడం నేరమన్నారు. మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఓజిలి: గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీఎల్‌పీవో రవీంద్ర బాబు తెలిపారు. ఆయన గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీఆర్‌వన్, జేజేఎం పల్స్ సర్వేలపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్, మురుగు కాలువల శుభ్రం, ట్యాంకుల మరమ్మతులు తదితరాలను పీఆర్‌వన్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రజనీకాంత్, ఈవోపీఆర్డీ మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని గమళ్లపాళెంలో ఉన్న వృద్ధులు, వికలాంగుల ఆశ్రమంలో గురువారం కేవీపీఎస్ కార్యదర్శి అడపాల ప్రసాద్ తండ్రి రామయ్య జయంతి సందర్భంగా అన్నదానం చేశారు. ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు కేవీపీఎస్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శివ, రాము, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

హెడ్ కానిస్టేబుల్‌పై సస్పెన్షన్ వేటు

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో పోలీస్‌స్టేషన్ రైటర్‌పై దాడికి యత్నించిన హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్ అయ్యాడు. వివరాలు ఇలా.. కలువాయి స్టేషన్‌లో రైటర్‌గా రమణయ్య, హెడ్ కానిస్టేబుల్‌గా జేమ్స్ విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం జేమ్స్ మద్యం మత్తులో నాకే డ్యూటీలు వేస్తావా అంటూ రైటర్‌పై దాడికి యత్నించాడు. రమణయ్య ఫిర్యాదు మేరకు రాపూరు సీఐ విజయకృష్ణ, కలువాయి ఎస్‌ఐ సుమన్ విచారణ చేశారు. వారి నివేదిక ఆధారంగా జేమ్స్‌ను సస్పెండ్ చేస్తూ గురువారం ఎస్పీ జి.కృష్ణకాంత్ ఉత్తర్వులు జారీచేశారు. విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించినా, అవినీతికి పాల్పడినా, క్రమశిక్షణను ఉల్లంఘించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇద్దరు ఎస్‌ఐలపై చర్యలు

సూళ్లూరుపేట: కేసుల దర్యాప్తు విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సూళ్లూరుపేట ఎస్‌ఐలుగా గతంలో పనిచేసిన ఇద్దరు ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురయ్యారు. వివరాలు.. 2023 సంవత్సరంలో పట్టణంలోని రాఘవయ్యపేటలో ఒక హత్యాయత్నం కేసును అప్పటి ఎస్‌ఐ రవిబాబు కొంతమంది నాయకుల మాటలు విని నిర్లక్ష్యంగా దర్యాప్తు చేయడంతో పాటు కీలక సాక్షులను సరిగా విచారించకుండా, వారిని బెదిరించి తప్పుడు నివేదిక అందించినట్లు ఉన్నతాధికారుల విచారణలో తేలింది. అప్పట్లోనే నిందితులను కాపాడేందుకు ఎస్‌ఐ రవిబాబు తీవ్రంగా ప్రయత్నించినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ కేసును ఇప్పుడు తిరగతోడడంతో నిజానిజాలు వెలుగు చూశాయి. ఎస్‌ఐ రవిబాబు ఎవరి ప్రాపకం కోసమో పనిచేసి అడ్డంగా ఇరుక్కుపోయారు. దీన్ని సీరియస్‌గా పరిగణించిన తిరుపతి జిల్లా సుబ్బరాయుడు అతన్ని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఆగస్టు 19 వరకు పనిచేసిన కే.రహీంరెడ్డి కూడా ఈ హత్యాయత్నం కేసులో సమగ్ర దర్యాప్తు చేయకుండా ఎస్‌ఐ రవిబాబు చేసిన తప్పులను సరిదిద్దకుండా ఉన్నతాధికారులకు తెలియకుండానే చార్జ్‌షీట్‌ను కోర్టుకు సమర్పించారు. ఈయన కూడా కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలడంతో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు క్రమశిక్షణా చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా చార్జ్ మెమో జారీ చేశారు. కేసును సమగ్రంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చేసి బాధితులకు న్యాయం చేయాల్సిన పోలీసులే ఇలా వ్యవహరించడంపై జిల్లా ఎస్పీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ వీరిపై చర్యలు తీసుకున్నారు.

గురువులతోనే సమసమాజ నిర్మాణం

తల్లిదండ్రులు జన్మనిస్తే.. గురువులు విద్యను అందించి జీవితాన్ని ఇస్తారు. మంచి సమాజం ఏర్పడాలంటే గురువులతోనే సాధ్యం. అందుకే తరగతి గదిలోనే భావి భారతం ఉంది అని పెద్ద చెబుతుంటారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువులకు గురువారం ఉత్తమ అవార్డులు అందజేసి ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు తెలుగు సంప్రదాయ దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలంరించారు.

– వెంకటగిరి రూరల్/కలువాయి/రాపూరు/నాయుడుపేట టౌన్/చిల్లకూరు/దక్కిలి/సైదాపురం/దొరవారిసత్రం/ఓజిలి/సూళ్లూరుపేట/పెళ్లకూరు/తడ/కోట



తడ : ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానం



దొరవారిసత్రం : కలెక్టర్ వెంకటేశ్వర్ నుంచి అవార్డు అందుకుంటున్న టీచర్ శ్రీనివాసులు



వెంకటగిరి రూరల్ : విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్ సిబ్బంది.



కలువాయి : ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు



నాయుడుపేట టౌన్ : విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న యాదవ సంక్షేమ సంఘం నేతలు



సూళ్లూరుపేట : టీచర్లను సత్కరిస్తున్న షార్ డైరెక్టర్ రాజరాజన్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి



రాపూరులో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు, జిలాని



చిల్లకూరు : ఉత్తమ ఉపాధ్యాయుని సత్కరిస్తున్న అధికారులు, కుటుంబ సభ్యులు



దక్కిలి : ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు



డీవీ సత్రంలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఓజిలి: కలెక్టర్ నుంచి అవార్డు తీసుకుంటున్న టీచర్ శ్రీనివాసులు



పెళ్లకూరులో గురుపూజోత్సవం నిర్వహిస్తున్న టీచర్లు



కోట: ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న అధికారులు



గూడూరు రూరల్ : టీచర్లను సత్కరిస్తున్న జెడ్పీటీసీ యామిని, ఎమ్మెల్యే

చిరుధాన్యాలతో రక్తహీనతకు చెక్

రాపూరు/వెంకటగిరి(సైదాపురం)/దక్కిలి/చిల్లకూరు : గర్భిణులు, బాలింతలు చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా రక్తహీనతను అధిగమించవచ్చని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఆమె గురువారం గోనుపల్లి బీజీ కాలనీ, తెగచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ ఆకుకూరలు, చిరు ధాన్యాలు తినాలని సూచించారు. అదే విధంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహిత వెంకటగిరి మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళా విధిగా పాలు, గుడ్లు, ఆకుకూరలు తినాలన్నారు. తద్వారా శరీరంలో పోషక విలువలు పెరిగి ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. అలాగే ఐసీడీఎస్ వెంకటగిరి సీడీపీవో శంషాద్‌బేగం దక్కిలి మండలంలోని దేవులపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు విద్యను అందిస్తున్నట్టు తెలిపారు. ప్రీ స్కూల్ కార్యక్రమాలతో పిల్లలు శారీరకంగా, మానసికంగా, సాంఘికంగా అభివృద్ధి చెందుతారని పేర్కొన్నారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు. సూపర్‌వైజర్ పరిమళ, అంగన్‌వాడీ కార్యకర్త ప్రభావతి పాల్గొన్నారు. అదేవిధంగా మండల కేంద్రమైన చిల్లకూరులో ఉన్న అరుంధతీవాడలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఏసీడీపీవో జ్యోతికరణ్ ఆధ్వర్యంలో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా ఆస్పత్రిలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారంతో పాటు విటమిన్, ఐరన్ మాత్రలను క్రమం తప్పకుండా వాడుకోవాలన్నారు. అనంతరం సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రేణుక, అంగన్‌వాడీ కార్యకర్తలు కమల, లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



రాపూరు : తెగచర్లలో పౌష్టికారంపై అవగాహన కల్పిస్తున్న రాజ్యలక్ష్మి

నిమ్మ తోటల పునరుద్ధరణ పథకంపై శిక్షణ

గూడూరు రూరల్ : గూడూరు మండలంలోని పాలిచెర్ల రైతు సేవా కేంద్రంలో గురువారం ఉద్యానశాఖ ఆధ్వర్యంలో పాత నిమ్మ తోటల పునరుద్దరణ పథకంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఉద్యాన అధికారి కార్తీక్ మాట్లాడుతూ కాపునకు వచ్చిన నిమ్మ చెట్లలో ఎండు పుల్లలు, వ్యాధి సోకిన కొమ్మలను కత్తిరించి 1 శాతం బోర్డో మిశ్రమాన్ని పిచికారీ చేయాలని సూచించారు. అనంతరం చెట్టు మొదలులో 2 నుంచి 3 అడుగుల ఎత్తు వరకు బోర్డో మిశ్రమాన్ని పూస్తే చెట్లు ఆరోగ్యంగా ఉంటాయని తెలిపారు. కొమ్మ కత్తిరింపులు చేసిన తోటల్లో దుక్కి దున్ని పాదులు చేసుకుని చెట్టుకు కిలో యూరియా, 1.25 కిలోల ఎస్‌ఎస్‌పీ, కిలో పొటాష్‌తోపాటు 30 కిలోల పశువుల ఎరువుకు 500 గ్రాముల వేప పిండిని కలిపి వేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అలాగే సూక్ష్మక్రిముల నివారణకు ఆగ్రోమిన్ మాక్స్ 10 గ్రాములు లీటరు నీటికి కలిపి ఏడాదికి రెండు సార్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కె.శివ, డి.మమత పాల్గొన్నారు.



నిమ్మ తోటను పరిశీలించి రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన అధికారి కార్తీక్

వరద బాధితులకు సహాయం చేయండి

చిల్లకూరు : విజయవాడ ప్రాంతంలోని వరద బాధితులకు రాష్ట్ర ప్రజలు ఆపన్న హస్తం అందించాలని ఏరూరు గ్రామానికి చెందిన సైకత శిల్పి మంచాల సనత్‌కుమార్ కోరారు. ఆయన గురువారం సముద్ర తీరంలో తనదైన శైలిలో సైకత శిల్పాన్ని రూపొందించారు. దీనికి ట్యాగ్‌లైన్‌గా హెల్ప్ ఫ్లడ్ విక్టమ్స్, విజయవాడ అని జోడించారు. ఆయన మాట్లాడుతూ విపత్తుల సందర్భంలో ఒకరికొకరు తోడుగా ఉండి ఆపన్నహస్తం అందించాలన్నారు.



సనత్‌కుమార్ రూపొందించిన సైకత శిల్పం

జీవో నంబర్ 21ను రద్దు చేయాలి

గూడూరు రూరల్ : మోటారు వాహన కార్మికులకు నష్టం కలిగించేలా ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 21ను రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం గూడూరు రవాణాశాఖ కార్యాలయంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ జకీర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రవాణా శాఖ జారీ చేసే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ప్రైవేటీకరణ చేయకుండా ప్రభుత్వం ద్వారానే మంజూరు చేయాలన్నారు. అర్హత కలిగిన డ్రైవర్లకు డ్రైవర్ల సాధికార సంస్థ ఏర్పాటు చేయాలని, రూ.10 వేలు సాయం అందించాలని, ఆటో డ్రైవర్లను ఫైనాన్సియర్ల ఆర్థిక దోపిడీ నుంచి కాపాడాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజానాట్య మండలి రాష్ట్ర నాయకులు రామానాయుడు, పెంచలయ్య, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎంబేటి చంద్రయ్య, నారాయణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి శశి, సీవీఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ, సీపీఐ నాయకులు

మృతురాలి ఆచూకీ కోసం ముమ్మర గాలింపు




పాళెంపాడు రోడ్డులో దహనం చేసిన మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఫైల్)




డీవీ సత్రం : ఓటిగుంట చెరువులో మృతి చెందిన గుర్తుతెలియని మహిళ మృతదేహం

దొరవారిసత్రం : మండల కేంద్రమైన దొరవారిసత్రం సమీపంలోని ఓటిగుంట చెరువులో మృతిచెందిన మహిళ ఆచూకీ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఘటనా స్థలంలో ఎలాంటి ఆధారాలు లభించలేదు. గుర్తుతెలియని వ్యక్తులు ఎక్కడో చంపి ఇక్కడ పడేసి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ప్రాంతంలో జన సంచారం కూడా పెద్దగా ఉండదు. దీన్ని అదునుగా తీసుకుని మృతదేహాన్ని వాహనంలో తీసుకువచ్చి చెరువులో పడేసి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. దొరవారిసత్రం మండలంలో జాతీయ రహదారి 16 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉంది. దీనికితోడు అటవీ ప్రాంతం అధికంగా ఉండడంతో ఇతర ప్రాంతాలకు చెందిన దుండగులు హత్య చేసి మృతదేహాలను ఇక్కడికి తీసుకువచ్చి పడేసి వెళ్లిపోతున్నారు. బుధవారం ఓటిగుంట చెరువులో గుర్తుతెలియని మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో 2012 మే నెలలో రహదారి సమీపంలోని పాళెంపాడు గ్రామ రోడ్డులో యువకుడి మృతదేహాన్ని దహనం చేశారు. ఇందులో ఇప్పటికీ చిక్కుముడి నేటి వీడలేదు. అదే విధంగా 2013, 2014లో ఇద్దరు వృద్ధులు అనుమానాస్పద స్థితిలో చెట్లకు ఉరి వేసుకుని మృతిచెందారు. మృతులు ఎవరనే విషయం నేటికీ ప్రశ్నగానే మిగిలిపోయింది.

రోడ్డంతా గుంతల మయం



ఆర్టీసీ సెంటర్ వద్ద రోడ్డు



ఎన్‌సీఆర్ నగర్ వద్ద

కోట: మండల కేంద్రమైన కోట ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు నుంచి వాకాడు, చిల్లకూరు మండలాలకు చెందిన వ్యాపారులు, ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కోట క్రాస్ రోడ్డు నుంచి కోట బజారువీధి వరకు రెండు కిలోమీటర్ల మేర అడుగడుగునా గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా మారింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో గుంతల్లో నీరు నిలిచింది. దీంతో వాహనదారుల అవస్థలు అంతాఇంతా కాదు. ముఖ్యంగా ఎన్‌సీఆర్ నగర్, ఆర్టీసీ సెంటర్ వద్ద మోకాళ్ల లోతు గుంతలు పడ్డాయి. రోడ్డు గురించి ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలి



గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు రూరల్ : నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ధరలు తగ్గించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామానాయుడు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య డిమాండ్ చేశారు. వారు గురువారం సీపీఐ నాయకులతో కలిసి గూడూరులోని సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, నూనె, కూరగాయల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ పేదలపై భారం మోపుతోందన్నారు. వెంటనే నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రజలకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని, ఆహార భద్రత చట్టం అమలు చేయాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, బాలకృష్ణ, నియోజకవర్గ కార్యదర్శి శశి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు ఎంబేటి చంద్రయ్య, నారాయణ, రైతు సంఘం జిల్లా నాయకులు సీవీఆర్ కుమార్, సీత భాస్కర్, అంకయ్య, మస్తానయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫలసరుకుల పంపిణీ



దివ్యాంగులకు ఫలసరుకులు అందజేస్తున్న ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి ప్రతినిధులు

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని త్యాగరాజావీధిలో ఉన్న కల్యాణ వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం రెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఇన్నర్‌వీల్, ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది పేద దివ్యాంగులకు నెలకు సరిపడా ఫలసరుకులు పంపిణీ చేశారు. వీటిని సౌందర్యమ్మ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ తనూజరెడ్డి, కార్యదర్శి అనిత, సభ్యులు స్నేహలతారెడ్డి, శశిరేఖ, లక్ష్మి, రెడ్ సంస్థ సభ్యులు జానా సుధీర్, కోడిపర్తి శ్రీధర్, పల్లం వెంకటేశ్వర్లు, శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 8.745 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 8.745 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల ప్రాజెక్టు నుంచి 5450 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 230 ,పిన్నేరువాగుకు 25, లోలెవల్ 70, హైలెవల్ కాలువకు 120 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పూజించండి

గూడూరు రూరల్ : వినాయక చవితి సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ కోరారు. పట్టణంలోని టవర్‌క్లాక్ సెంటర్ వద్ద గురువారం జేవీవీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో చేసిన విగ్రహాలు నీటిలో కరగవన్నారు. నీరు కూడా కలుషితం అవుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు నాగరాజు, రామమోహన్, ప్రభాకర్, ఇబ్రహీం, సుమన్‌రెడ్డి, రజనీకాంత్, పవన్‌కుమార్, జగదీష్, గోపి, శ్రీనివాస ఆచారి, దేవానంద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం



కలువాయిలో రక్తదానం చేస్తున్న నిర్వాహకులు

కలువాయి : రక్తదానంతో మరొకరికి ప్రాణదానం చేయవచ్చని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కలువాయి మండల సబ్ బ్రాంచ్ మేనేజర్ పుల్లయ్య తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలువాయి మండలంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 61 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేసినట్లు తెలిపారు. రక్తదానం చేయడం వల్ల ఆరోగ్యంగా ఉండడంతోపాటు గుండెపోటు, బీపీ, షుగర్ వంటి వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌డీ అబ్బాస్, ఆలీ, చిన్నయ్య, వీరేంద్ర, కిరణ్, రాము, షఫీ, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట టౌన్ : వినాయక చవితి ఉత్సవాలను నిబంధనలకు అనుగుణంగా జరుపుకోవాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. ఆయన గురువారం వినాయక చవితి ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సింగిల్ విండో విధానంపై అనుమతి తీసుకోవాలన్నారు. రికార్డు డ్యాన్సులు, అశ్లీల ప్రదర్శనలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్లపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వినాయక మండపాల వద్ద కమిటీ సభ్యులు పర్యవేక్షణ ఉండాలని సూచించారు. తాళ్లు పట్టుకుని వాహనాలు నిలిపి బలవంతపు వసూళ్లకు పాల్పడరాదని హెచ్చరించారు. నాయుడుపేట అర్బన్ సీఐ బాబి పాల్గొన్నారు.